

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | ఆదివారం 27 సెప్టెంబరు 2026 | సంపుటి : 01, సంచిక : 06 | పేజీలు : 04, వెల రూ.2

స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు



స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష

సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్

క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన

కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిన్న సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, నివేదించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీతో ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ విధివిధానాలు, మిగతా..2లో

మమ్మల్ని అడ్డుకుని, గృహనిర్బంధం : మమత సంచలన వ్యాఖ్యలు



ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లే మార్గాన్ని బీజేపీ కార్యకర్తలు తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు.

కోర్టు అనుమతితోనే తాము తలపెట్టిన ర్యాలీ నిర్ణయించినప్పటికీ బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారని మండిపడ్డారు.

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీపై శనివారం సంచలన ఆరోపణలు చేశారు. సెరాంపూర్‌లో జరగనున్న ర్యాలీకి హాజరుకాకుండా తనను, పలువురు పార్టీ నాయకులను గృహనిర్బంధంలో ఉంచారని ఆరోపించారు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా, కోర్టు అనుమతితోనే తాము తలపెట్టిన ర్యాలీ నిర్ణయించినప్పటికీ బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారని మండిపడ్డారు. ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లే మార్గాన్ని బీజేపీ కార్యకర్తలు మిగతా..2లో

పోలీసు యూనిఫాం గౌరవాన్ని, డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠను కాపాడాలి



★కర్నూలులోని ఏపీఎస్పీ 2వ బెటాలియన్ లో ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

★629 మంది ట్రైనీ కానిస్టేబుళ్లను అభినందించిన మంత్రి టీజీ భరత్

★డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచన

అమరావతి : పోలీసు శాఖలోకి కొత్తగా అడుగుపెడుతున్న యువ కానిస్టేబుళ్లు కర్నూలులోని

దశాబ్దాల కల నెరవేర్చనున్న సీఎం..
30న క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ

●పేదలకు పట్టాభిషేకంలో భాగంగా మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

●ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించనున్నారు.



అమరావతి, సెప్టెంబర్ 26: పేదలకు పట్టాభిషేకంలో భాగంగా మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించనున్నారు. విశాఖ తరహాలోనే విజయవాడలోనూ భారీ ఎత్తున 24,057 మందికి ఇళ్ల రెగ్యులరైజేషన్ పట్టాలను అందజేయనున్నారు. విజయవాడలో దశాబ్దాల క్రితం ఇచ్చిన ఎన్టీఆర్ పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం పంపిణీ చేయనున్నారు. ప్రతి ఎన్నికలోనూ విజయవాడలో ప్రధాన ఎన్నికల అజెండాగా మిగిలిపోతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ శాశ్వత పరిష్కారం చూపుతోంది. ఇటీవలే విశాఖలో పండుగ వాతావరణంలో రూ.8874 కోట్ల విలువైన భూమిపై మిగతా..2లో

ఇంధన నిర్వహణ అద్భుతం..
అదానీ సెంటర్‌పై లోకేశ్ ట్వీట్

●అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేశ్

●రియల్ టైంలో విద్యుత్ ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్న తీరు పరిశీలన

●పర్యటన వివరాలను ఎక్స్ ఖాతాలో పంచుకున్న లోకేశ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా అదానీ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ పర్యటనకు సంబంధించిన విశేషాలను ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. అదానీ గ్రూప్ తమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా రియల్ టైమ్ పద్ధతిలో పర్యవేక్షిస్తున్న తీరును లోకేశ్ పరిశీలించారు. ఈ విధానం వల్ల మెరుగైన పనితీరును సాధించవచ్చని, సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అలాగే సాంకేతిక అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని మిగతా..2లో

హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు..
కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ



★హైదరాబాద్ జీపీఓ హోదా తగ్గింపు ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్రానికి ఒవైసీ లేఖ

★జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి 'బీ'కి మార్చడాన్ని వ్యతిరేకించిన హైదరాబాద్ ఎంపీ

★ఇది వందేళ్ల చారిత్రక సంస్థ అని, పనిభారం అధికమని లేఖలో వెల్లడి

★తెలంగాణలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో ఇక్కడే ఉందని గుర్తు చేసిన అసద్

★కేంద్ర మంత్రులు పెమ్మసాని, సింధియా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'..
ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

●బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు

●విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి

●పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ

●వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు

●పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు



ఢిల్లీ : అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. మిగతా..2లో

భారత్-అమెరికా ట్రేడ్ డీల్ తుది దశకు

❖ ఒప్పందానికి సంబంధించిన పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు.

❖తుది దశలో ఉన్న అంశాలను ఇరు దేశాలు పరిష్కరించగలిగితే వాణిజ్య రంగంలో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయని



భారత్-అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఒప్పందానికి సంబంధించిన పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ప్రస్తుతం కొన్ని తుది అంశాలపైనే ఇరు దేశాలు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు తుది ఒప్పందంపై అధికారిక సంతకాలు జరగలేదు. అమెరికా అధికారి వ్యాఖ్యల ప్రకారం.. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు గత కొన్ని దశాబ్దాలుగా అత్యంత క్లిష్టమైన అంశాల్లో ఒకటిగా ఉన్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు అనేక అంశాలపై చర్చలు జరిగాయి. తుది దశలో ఉన్న అంశాలను ఇరు దేశాలు పరిష్కరించగలిగితే వాణిజ్య రంగంలో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయని అమెరికా అధికారి అభిప్రాయపడ్డారు. మిగతా..2లో

ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత



★ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత

★రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ

★తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్ గా ఉందని వెల్లడి

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

ఈ నెల 30న సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి
భారీ బహిరంగ సభ

●సిరిసిల్లలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది.

●సభకు ముందు దాదాపు 4 కి.మీ. మేర భారీ ర్యాలీ తీసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.



ఢిల్లీ : సిరిసిల్లలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. 30వ తేదీ సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ఈ సభ నిర్వహించనున్న హస్తం పార్టీ, సభకు ముందు దాదాపు 4 కిలోమీటర్ల మేర కొనసాగే భారీ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భారీగా జన సమీకరణ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మంత్రులు, ఎమ్మెల్యేలకు సభ నిర్వహణ బాధ్యతలు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ఈ సభను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగుతున్నారు. సభకు జన సమీకరణ, ర్యాలీ నిర్వహణ, స్థానిక నేతల సమన్వయం, మిగతా..2లో

రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్





●రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్

●హామీలు అమలు కాలేదని ఆరోపణ

●కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

●2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

●సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.

రాయలసీమ దరువు
APTEL/28/A7874
www.royaleseemadaruvu.com
తెలుగు దినపత్రిక

మొదటి పేజీ తరువాయి

ఇంధన నిర్వహణ అద్భుతం.. అదానీ సెంటర్‌పై లోకేశ్ ట్వీట్

ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "భారీ ఇంధన మౌలిక సదుపాయాల నిర్వహణలో సాంకేతికతను, డేటాను వినియోగిస్తున్న విధానం ఎంతో ఆసక్తికరంగా ఉంది. అహ్మదాబాద్ పర్యటనలో ఈ సెంటర్‌ను సందర్శించడం మంచి అనుభవం" అని లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆతిథ్యం ఇచ్చిన మిత్రుడు కరణ్ అదానీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ నెల 30న సిరిసిల్లలో
సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ

సభా ప్రాంగణంలో ఏర్పాట్ల పర్యవేక్షణ వంటి అంశాలను మంత్రులు దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. మరోవైపు ఎమ్మెల్యేలను కూడా నియోజకవర్గాలు, మండలాల వారీగా ఇన్‌ఛార్జ్‌లు లుగా నియమించి సభను విజయవంతం చేసేలా పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది. సిరిసిల్ల టౌన్‌లో సుమారు 4 కిలోమీటర్ల మేర జరిగే ర్యాలీపై పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సీఎం స్వయంగా ర్యాలీలో ముందుండి నడవనున్నందున మార్గం పొడవునా భారీగా పార్టీ శ్రేణులు, ప్రజలను సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ర్యాలీ ముగిసిన తర్వాత భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభలో ముఖ్యమంత్రి ప్రసంగంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సిరిసిల్ల ప్రాంతానికి సంబంధించిన అనేక అభివృద్ధి పథకాలను ప్రస్తావించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సభ ఏర్పాట్లపై పార్టీ నేతలు కసరత్తు మొదలుపెట్టారు. ఎక్కడెక్కడి నుంచి ఎంతమందిని సమీకరించాలి? ర్యాలీ మార్గంలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? సభా ప్రాంగణంలో వేదిక, ప్రజలు కూర్చునే ఏర్పాట్లు ఎలా ఉండాలి? ట్రాఫిక్, పార్కింగ్, భద్రత వంటి అంశాలపై అధికారులు, పార్టీ నేతలు సమన్వయం చేసుకోనున్నారు.

రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'..
ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైజ్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు..
కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

ఢిల్లి : హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహానగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీపీఓ హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను రద్దు చేసి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్..
సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు

బాధ్యతలపై పవన్ కల్యాణ్ సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమగ్ర సమాచారంతో నివేదికలు సిద్ధం చేయాలని, సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు వివరాలను తనకు నివేదించాలని సూచించారు. కమిటీ కార్యకలాపాలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు సోమవారం మరోసారి సమావేశం కావాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, పులపర్తి ప్రశాంత్, యనమల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని అడ్డుకుని, గృహనిర్బంధం
మమత సంచలన వ్యాఖ్యలు



తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్, కారుపై రాళ్ళదాడిచేసి కొంతమంది దుండగులు అడ్డుకున్న నేపథ్యంలో మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. 15 రోజులు కోర్టులో పోరాడి, అనుమతి పొందిన తర్వాతే ఈ రోజు సమావేశాన్ని ఏర్పాటు చేశామని అయితే, బీజేపీ గూండాలు రౌడీలు రోడ్డు బ్లాక్ చేసి తమని కనీసం ఇంటి బయటకు కూడా అడుగు పెట్టనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిని తానె క్కడా చూడలేదని, ఆఫ్రికన్ దేశాల్లో కూడా ఇలాంటివి జరగవని విమర్శించారు. ర్యాలీ మార్గాన్ని బీజేపీ కార్యకర్తలు తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఎలాంటి పోలీసు భద్రత లేకుండా తమపై దాడులు జరుగుతున్నాయని మండి పడ్డారు. యూపీ, బిహార్‌లో కూడా లేని విధంగా బెంగాల్‌లో అరాచకం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కోర్టు అనుమతి పొందిన ఈ ర్యాలీ జరిపి తీరుతామని, సభలో ప్రసంగించి తీరుతామని ఆమె సవాల్ విసిరారు. ర్యాలీ సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు. ఇది ఇలా ఉంటే, ఈ ఉదయం సెరాంపూర్‌లో సభకు బయలుదేరిన టీఎంసీ ఎమ్మెల్యే, పార్టీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ కారుపై హుగ్లీ జిల్లా ఉత్తరపారాలో కొందరు నల్ల జెండాలతో వచ్చి రాళ్లు, గుడ్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే.

దశాబ్దాల కల నెరవేర్చనున్న సీఎం.. 30న క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

28,445 కుటుంబాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు సీఎం అందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు విజయవాడలో రూ.9800 కోట్ల విలువైన భూమిపై 24,057 కుటుంబాలకు రెగ్యులరైజేషన్ పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఒక్కో కుటుంబానికి రమారమి రూ.40-45 లక్షలకు వరకు లబ్ధి చేకూర్చేలా క్రమబద్ధీకరణ పట్టాలను ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, కృష్ణా జిల్లా పరిధిలోని గన్నవరం నియోజవర్గం పరిధిలోని మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో సంపూర్ణ హక్కులతో ఈ పట్టలను అందజేస్తారు. విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమం, విజయవాడ సెంట్రల్, గన్నవరం, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, తిరువూరు



నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు, అలాగే విజయవాడ నగరంలోని 3 నియోజకవర్గాల పరిధిలోని కొండలపై నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలను అందిస్తూ లబ్ధిదారుల కలలను సీఎం చంద్రబాబు సాకారం చేయనున్నారు. క్రమబద్ధీకరణ పట్టాలిస్తే తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా ఉంటుందని దశాబ్దాలుగా కొండ ప్రాంత నివాసితులు డిమాండ్ చేస్తోన్న విషయం విదితమే. ఇటీవల జరిగిన జిల్లా ప్రజా ప్రతినిధుల సమావేశంలోనూ ఇళ్ల పట్టాల రెగ్యులరైజేషన్‌పై ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాల కలను నిజం చేస్తూ 617 ఎకరాల్లోని 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై సంపూర్ణ హక్కులను ప్రభుత్వం కల్పించనుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంపూర్ణ హక్కు కల్పిస్తూ రెగ్యులరైజేషన్ పట్టాలిస్తున్న భూముల మార్కెట్ విలువ సుమారు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. సంపూర్ణ హక్కులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం పంపిణీ చేయబోతోన్న పట్టాల ద్వారా బీసీలు 12093, ఓసీలు 6130, ఎస్సీలు 4546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలకు లబ్ధిచూకూరనుంది.

భారత్-అమెరికా ట్రేడ్ డీల్ తుది దశకు

మొదటి పేజీ తరువాయి

అయితే మిగిలిన అంశాల స్వభావం, వాటిపై ఏకాభిప్రాయం ఎప్పుడు కుదురుతుందనే విషయంపై స్పష్టమైన అధికారిక గడువు ప్రకటించలేదు.

అక్టోబర్‌లో మార్కో రూబియో భారత్ పర్యటన

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని సీనియర్ అధికారి తెలిపారు. భారత్-అమెరికా భాగస్వామ్యంలో వాణిజ్యంతో పాటు రక్షణ, సాంకేతికత, ఇంధనం, ఇండో-పసిఫిక్ సహకారం వంటి రంగాలకు కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ పర్యటన జరిగితే ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. అయితే వాణిజ్య ఒప్పందంపై తుది నిర్ణయం ఈ పర్యటనలోనే వస్తుందని అధికారికంగా నిర్ధారించలేదు. ఫ్లోరిడాలో అమెరికా ఆతిథ్యమివ్వనున్న జీ20 శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబర్‌లో అమెరికా వెళ్లే అవకాశం ఉందని అమెరికా అధికారి తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్యంతో పాటు ఇతర వ్యూహాత్మక అంశాలపై కూడా ఇరు దేశాల మధ్య కీలక చర్చలు, ప్రకటనలు ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే మోదీ పర్యటనకు సంబంధించిన తుది అధికారిక షెడ్యూల్, దానిలో వాణిజ్య ఒప్పందం సంతకం అవుతుందా అనే అంశాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్యులుగా ఉన్న క్వాడ్ కూడా ఇరు దేశాల వ్యూహాత్మక సంబంధాల్లో కీలక వేదికగా కొనసాగుతోంది. 2026 మే 26న న్యూఢిల్లీలో 11వ క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఇందులో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సముద్ర భద్రత, ఇండో-పసిఫిక్ ప్రాంతం, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు వంటి అంశాలపై సహకారానికి సంబంధించిన పలు కార్యక్రమాలను ప్రకటించారు. ఇండో-పసిఫిక్ మారిటైమ్ సర్వైలెన్స్ సహకారం, క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ పై కూడా అమెరికా, భారత్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని సీనియర్ అధికారి తెలిపారు. భారత్ నుంచి పశ్చిమాసియా మీదుగా యూరప్ వరకు వాణిజ్య, రవాణా అనుసంధానాన్ని పెంచే లక్ష్యంతో రూపొందినలో రైల్వే, షిప్పింగ్, లాజిస్టిక్స్, డిజిటల్ కనెక్టివిటీ వంటి అంశాలు ఉన్నాయి. అయితే మధ్యప్రాచ్యంలో చోటుచేసుకున్న పరిణామాల



కారణంగా ఈ ప్రాజెక్టు పురోగతికి అంతరాయాలు ఏర్పడ్డాయని అమెరికా అధికారి పేర్కొన్నారు. ఇజ్రాయెల్-గాజా పరిస్థితులు, ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలు వంటి అంశాలు ప్రాజెక్టుపై ప్రభావం చూపాయని ఆయన తెలిపారు. ప్రాంతీయ పరిస్థితులు స్థిరపడితే ×వీజుజ పనులు తిరిగి వేగం పుంజుకునే అవకాశం ఉందని చెప్పారు.

ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత

మొదటి పేజీ తరువాయి

ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరపున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని



దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరపున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, దుబాయ్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు. తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని, ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లకు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

పోలీసు యూనిఫాం గౌరవాన్ని, డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠను కాపాడాలి: టీజీ భరత్

మొదటి పేజీ తరువాయి

ఏపీఎస్పీ 2వ బెటాలియన్ లో పాసింగ్ అవుట్ పరేడ్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మంత్రి టీజీ భరత్ విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 629 మంది ట్రైనీ కానిస్టేబుళ్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగా బాధ్యతలు చేపడుతున్న కానిస్టేబుళ్లు విధులను సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా, తాము ధరించిన యూనిఫాం గౌరవాన్ని, డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠను ఎల్లప్పుడూ కాపాడాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక కాలంలో నేరాల తీరు మారిపోతోందని మంత్రి పేర్కొన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మహిళలు అలాగే చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు నేటి పోలీసులకు సవాలుగా మారుతున్నాయని గుర్తుచేశారు. ఈ క్రైమ్స్‌ను ఎదుర్కోవాలంటే కేవలం సంప్రదాయ పద్ధతులే కాకుండా డిజిటల్ పరిజ్ఞానం తప్పనిసరి అని స్పష్టం చేశారు. మొబైల్స్, కంప్యూటర్లు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి పక్కా ఆధారాలు సేకరించడంలో మన పోలీసులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్తు అంతా టెక్నాలజీ, డేటా ఆధారిత పోలీసింగ్‌దేనని, కొత్త తరం సిబ్బంది ఈ ఆధునిక సాంకేతికతను వేగంగా ఒడిసిపట్టాలని ఆకాంక్షించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి తమ కెరీర్‌ను ప్రారంభిస్తున్న అందరికీ ఇది చక్కటి ఆరంభమని అన్నారు. ఇక పోలీసు శాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాబోయే రోజుల్లో మరిన్ని పోలీస్ ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి,



ఎస్పీ విక్రాంత్ పాటిల్, బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ తదితరులు పాలుపంచుకున్నారు.

ఓనం లాటరీ జాక్‌పాట్ - రూ.30 కోట్లు గెలుచుకున్న అజ్ఞాత వ్యక్తి

ఓనం బంపర్ లాటరీ ఫలితాలు రిలీజ్- కన్నూర్‌లో టికెట్ కొన్న వ్యక్తికి ఫస్ట్ ప్రైజ్- రూ.30 కోట్లు కొల్లగొట్టిన అజ్ఞాతవాసి- ఆ వ్యక్తి ఎవరో ఇంకా తెలియలేదు!



కేరళంలో ఓనం బంపర్ లాటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ లాటరీలో ూ 360615 నెంబర్ గల టికెట్‌కు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అంటే రూ.30 కోట్ల భారీ జాక్‌పాట్ తగిలింది. అయితే ఆ అజ్ఞాత వ్యక్తి ఎవరో ఇంకా తెలియలేదు. అయితే ఈ మొదటి బహుమతి టికెట్‌ను కన్నూర్‌లోని 'ముత్తు లాటరీ ఏజెన్సీ' విక్రయించింది. ఆ లాటరీ ఏజెన్సీ ఏజెంట్ అనీశ్ ఈ టికెట్‌ను విజేతకు తాలిపరంబలో విక్రయించారు. కాగా, అనీశ్ గత 18 ఏళ్లుగా లాటరీ టికెట్ల వ్యాపారంలో ఉన్నారు. కాగా, గత క్రిస్మస్- నూతన సంవత్సర బంపర్ లాటరీలో మొదటి బహుమతి కూడా తాలిపరంబలో విక్రయించిన టికెట్‌కే రావడం గమనార్హం. కింద రూ.30 కోట్లు అందిస్తారు. రెండో బహుమతి కింద 20 మందికి (ప్రతి సిరీస్ నుంచి ఇద్దరు విజేతలకు) తలో రూ. కోటి చొప్పున ఇస్తారు. మూడో బహుమతి కింద 20 మంది తలో రూ.25 లక్షలు, నాలుగో బహుమతి కింద 10 మందికి రూ.5 లక్షలు చొప్పున అందిస్తారు. ఐదో బహుమతి కింద 10 మందికి రూ.2 లక్షలు చొప్పున ఇస్తారు. ఇవే కాకుండా మిగిలిన సిరీస్‌లో ఒకే అదృష్ట సంఖ్య కలిగిన తొమ్మిది మందికి కన్సోలేషన్ ప్రైజ్‌గా రూ.5 లక్షల చొప్పున అందజేస్తారు.

90 లక్షల టికెట్లు సేల్

కేరళం రాష్ట్ర లాటరీ చరిత్రలో ముద్రించిన ఓనం బంపర్ లాటరీ టికెట్ల స్టాక్ మొత్తం అమ్ముడుపోవడం ఇదే మొదటిసారి. మొత్తం 90 లక్షల ఓనం బంపర్ లాటరీ టికెట్లు ముద్రిస్తే అవన్నీ అమ్ముడైపోయాయి. గతేడాది 75 లక్షల టికెట్లు మాత్రమే సేల్ అయ్యాయి. ఈసారి డ్రాకు ఒక రోజు ముందుగానే మొత్తం టికెట్లు అమ్ముడైపోయాయి. అత్యధిక సంఖ్యలో లాటరీ టికెట్లు పాలక్కాడ్ జిల్లాలో సేల్ అయ్యాయి. గతేడాది ఓనం బంపర్ లాటరీ ఫ్రైజ్ మనీ రూ.25 కోట్లుగా ఉండేది. ఈ ఏడాది దాన్ని రూ.30 కోట్లకు పెంచారు. 2025 ఓనం బంపర్ లాటరీ మొదటి బహుమతిని అలప్పుజలోని తురవూర్‌కు చెందిన శరత్ ఎస్. నాయర్ గెల్చుకున్నారు. ఆయన నెట్టూర్‌లోని నిప్పాన్ పెయింట్స్ షాపులో పనిచేసేవారు. ఓనం బంపర్ లాటరీ టికెట్ కొన్న మొదటిసారే అయనకు అదృష్టం వరించింది. నెట్టూర్‌లోని లాటరీ ఏజెంట్ ఎంటీ లతీశ్ విక్రయించిన ఎన 577825 అనే టికెట్ నంబర్‌కు ఈ ప్రథమ బహుమతి లభించింది.

విజేతకు మిగిలేది ఎంతంటే?

లాటరీ టికెట్ విజేతకు ప్రైజ్ మనీ మొత్తం రాదనే విషయం గుర్తుంచుకోవాలి. బహుమతిగా పొందిన రూ. 30 కోట్లలో 10 శాతం ఏజెంట్‌కు కమిషన్ వెళ్లిపోతుంది. అంటే టికెట్ విక్రయించిన ఏజెన్సీకి రూ.3 కోట్లు లభిస

రాయలసీమ దరువు APTEL/28/A7874 www.royaleseemadaruvu.com తెలుగు దినపత్రిక

41 మందికి అంగన్వాడీ నియామక పత్రాలు



మడకశిర, దరువు న్యూస్:పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 41 మంది అంగన్వాడీ సహాయకులకు నియామక పత్రాలను అందజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నియామక పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అంగన్వాడీ సహాయకులకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ వ్యూహరచన



కదిరి, దరువు న్యూస్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. బీజేపీ జాతీయ నాయకులు, ఆల్ సెల్ జాతీయ కో-కోఆర్డినేటర్ యస్. విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు.కూటమి పార్టీలతో సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కోవడం, స్థానిక పరిస్థితులు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని పోటీ చేసే స్థానాలపై ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు.ప్రజల్లో మంచి పేరు, పార్టీ పట్ల నిబద్ధత, క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు ఉన్న సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉత్తమ రెడ్డి, సుదర్శన్, పి.టి.



ఆంజనేయులు, వెంకటేష్, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ డీ.ఎల్. ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు కేతే గిరిజమ్మ, మేకల నాగార్జున, ప్రతాప్, మైనారిటీ నాయకులు ఇంతియాజ్, షేక్ మైనుద్దీన్ తదితరులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల పేరుతో రంగుల మార్పు ఆపాలి

ప్రభుత్వ దుబారా ఖర్చులు తగ్గించి అభివృద్ధికి నిధులు కేటాయించాలి





పుట్టపర్తి దరువు న్యూస్:గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చడం, కొత్త బోర్డులు ఏర్పాటు చేయడం పేరుతో ప్రభుత్వ నిధులను దుబారా చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు.గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సుమారు 500 రకాల ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందించాలనే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 2024 తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.గ్రామ, వార్డు సచివాలయాలకు 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు' పేర్లతో కొత్త బోర్డులు ఏర్పాటు చేస్తూ పసుపు రంగు వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.గతంలో ప్రభుత్వ భవనాలకు రంగులు వేయడంపై వందల కోట్ల రూపాయల ఖర్చు చేశారని విమర్శించిన కూటమి నాయకులు, ప్రస్తుతం ఇదే విధంగా బోర్డులకు రంగులు, కొత్త ఫ్లెక్సీల పేరుతో ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్త ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి భారీగా నిధులు ఖర్చు-వుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వ దుబారా ఖర్చులను తగ్గించి ఆ నిధులను ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యత



పుట్టపర్తి, దరువు న్యూస్:ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. పుట్టపర్తి షాదీఖానాలో ముస్లిం మైనార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.మైనార్టీల సమస్యలను అడిగి తెలుసుకున్న పల్లె రఘునాథ్ రెడ్డి, వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను 2014-17లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని పలు మండలాల్లో షాదీఖానాల నిర్మాణం, దర్గాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.పుట్టపర్తి షాదీఖానాలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, పై అంతస్తులో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, జనసేన నాయకులు అబ్దుల్లా, టీడీపీ నాయకులు షామీర్ భాష, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి విద్యార్థులకు టాటా ఎలెక్సీ మాక్ ఇంటర్వ్యూలు



పుట్టపర్తి, దరువు న్యూస్:గ్రామీణ ప్రాంత ఇంజినీరింగ్, బిజినెస్ విద్యార్థులను కార్పొరేట్ ఉద్యోగాలకు సన్నద్ధం చేసే లక్ష్యంతో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 'కెరీర్ ఎడ్జ్--2026' కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన టాటా ఎలెక్సీ సంస్థకు చెందిన సుమారు 30 మంది నిపుణులు పాల్గొని విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, వృత్తిపరమైన ప్రవర్తనపై అవగాహన కల్పించారు.కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా టాటా ఎలెక్సీ బృందం బెంగళూరు నుంచి పుట్టపర్తికి వచ్చి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించింది. ఈ సందర్భంగా సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ బి. అశోక్, సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. హేమచంద్ర టాటా ఎలెక్సీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమాన్ని



విజయవంతంగా నిర్వహించిన కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాయపాటి నాగరాజును అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉద్యోగ సాధన సామర్థ్యం, ఆత్మవిశ్వాసం, కార్పొరేట్ రెడీనెస్ పెరుగుతాయని వారు పేర్కొన్నారు.

కదిరి వైభవానికి 'కందికుంట విజన్'



కదిరి దరువు న్యూస్:చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందిన కదిరి ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పలు కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.నియోజకవర్గంలో నిర్వహించే ఉత్సవాలను వైభవంగా



నిర్వహించడంతో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు.ఇందులో భాగంగా గాండ్లపెంటలో యోగి వేమన ఉత్సవాలు, శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు.నంబులపూలకుంట మండలంలోని ప్రపంచ ప్రఖ్యాత తిమ్మమ్మ మర్రిమానులో శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తిమ్మమ్మ మర్రిమానులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు బొటానికల్ గార్డెన్‌కు శంకుస్థాపన చేయనున్నారు.కదిరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా తలుపుల మండలం బత్రేపల్లి వద్ద పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కదిరి సమీపంలోని దేవర చెరువు వద్ద కోటి రూపాయలకు పైగా నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. ఇటీవల వినాయక నిమజ్జనానికి ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ దీపాలతో ఏర్పాట్లు చేశారు.నల్లచెరువు మండలం పాలపాటి దిన్నెలోని ఆంజనేయస్వామి ఆలయ శ్రావణమాస ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించి భక్తులకు సౌకర్యాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కదిరి ప్రాంతంలోని ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రాచుర్యం కల్పించేలా చర్యలు కొనసాగుతున్నాయి.

ఘనంగా అంగన్వాడీ ఉత్సవం



పుట్టపర్తి, దరువు న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా పీడీ ఆదేశాల మేరకు పుట్టపర్తి సాయి ఆరామం ఆవరణలో అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పాల్గొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు.అంగన్వాడీ కేంద్రంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించి అభినందించారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ప్లేట్లు, గ్లాసుల నాణ్యతను పరిశీలించారు. విశిష్ట సేవలు అందించిన అంగన్వాడీ కార్యకర్తలను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో పుట్టపర్తి సీడీపీవో



ఈ. జయంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయ్యగారి రజిత, అంగన్వాడీ కార్యకర్తలు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నీట్ లోజాతీయస్థాయిలో 60వ ర్యాంకు సాధించిన ఉదయ్ శ్రీ..



సోమందేపల్లి,దరువు న్యూస్:జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక నీట్ పరీక్షల్లో ఉదయ్ శ్రీ సత్తా చాటారు.సోమందేపల్లి మండలం మేకలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు సిద్ధలింగప్ప జయంతి దంపతులు కుమార్తె ఉదయశ్రీ అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో 60వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సిద్ద లింగప్ప నివాసంలో శనివారం ఉదయ్ శ్రీని కుటుంబ సభ్యులుని టిడిపి నాయకులు శాలువా పూలమాలు వేసి అభినందించారు.కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించిన ఉదయ్ శ్రీ విజయంపై వారు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వైద్య విద్యలో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.ఢిల్లీ ఎయిమ్స్ లో సీటు సాధించడమే నా లక్ష్యమని ఉదయ్ శ్రీ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వడ్డె సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, సుభాష్,ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆశా వర్కర్ల సేవలు అమూల్యం



బత్తలపల్లి, దరువు న్యూస్:అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు చిన్నారులు, తల్లులు, కుటుంబాల ఆరోగ్యం, పోషణ కోసం అందిస్తున్న సేవలు అమూల్యమైనవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.బత్తలపల్లిలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవంలో ఆయన పాల్గొని కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా చిన్నారుల ప్రారంభ విద్య, ఆరోగ్యం, పోషణకు పునాది వేస్తున్న కేంద్రాలని అన్నారు.దేశవ్యాప్తంగా 14.03 లక్షల అంగన్వాడీ కేంద్రాల ద్వారా సుమారు 8.98 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని తెలిపారు. 'పోషణ్ భీ పఢాయీ భీ' కార్యక్రమం ద్వారా ప్రారంభ విద్యకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆశా వర్కర్లు కీలకమైన వారధిగా పనిచేస్తున్నారని మంత్రి అభినందించారు.వారి సేవలను ఒకరోజు సన్మానానికి పరిమితం చేయకుండా సమాజానికి విస్తృతంగా పరిచయం చేయాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరించే లక్ష్యంతో 'సక్షమ్ అంగన్వాడీ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు సుష్మా, కోటి సుధా, జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జగ్గా నాగరత్న, సీడీపీవో సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాయలసీమ దరువు APTEL/28/A7874 www.royaleseemadaruvu.com తెలుగు దినపత్రిక

ఎన్నికల కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాలి



గుంతకల్లు, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

భారత ప్రధాని ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే తన పది రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఓటు చోరీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కమిషనర్ రాజీనామా చేయాలన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎన్నికల కమిషనర్ 13 కోట్ల ఓటర్లను తొలగించడం అది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఏకపక్ష నిర్ణయాలతో బిజెపి పార్టీకి ఈవీఎంల ద్వారా ఓట్లు చోరీ జరిపారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అలం నవాజ్, జిల్లా జనరల్ సెక్రెటరీ అబ్దుల్ మాలిక్, పట్టణ అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఖాదర్ వలీ, బీసీ విభాగం చైర్మన్ గోపాల్, అక్బర్, నరసన్న రామచంద్రస్వామి, మస్తాన్, కిష్టప్ప, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

కల్లుమర్రిలో అంగన్వాడీ మహోత్సవాలు

- ముఖ్యఅతిథిగా టీడీపీ మండల కన్వీనర్ కల్లుమర్రి నాగరాజు



మడకశిర, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

మడకశిర మండలం, కల్లుమర్రి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మడకశిర మండలం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కల్లుమర్రి నాగరాజు హాజరయ్యారు. అంగన్వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్టాల్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, తదితర సేవలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, అంగన్వాడీ లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి



గుంతకల్లు, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయా లని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచుల పదవి ముగిసిన సందర్భంగా వై.వెంకట్రామిరెడ్డి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికలు వైసీపీ జెండా ఎగరవేసేందుకు ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయాలన్నారు. కష్టపడే వారికి పార్టీలో ఎప్పటికీ అవకాశాలు ఉంటాయి అన్నారు. గతంలో పార్టీలో ఉన్న కొందరు వలస వెళ్లిపోయారని ఇప్పుడు స్వచ్ఛమైన గంగాజలం వంటి వారు మాత్రమే పార్టీలు ఉన్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గుంతకల్ నియోజకవర్గం పరిధిలోని గుంతకల్లు గుత్తి పామిడి సంబంధించిన సర్పంచులు, ఎంపీటీసీలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డితో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం చెరువుకు మహర్దశ..

- రూ.150 కోట్లతో లేక్‌ఫ్రంట్ అభివృద్ధి
- ప్రాజెక్టర్ విధానాలు విజయవాడ బృందం మంత్రికి వివరింపు





ధర్మవరం, సెప్టెంబరు 26, దరువు న్యూస్ :

ధర్మవరం పట్టణానికి ప్రకృతి ప్రసాదించిన వరంగా నిలిచిన ధర్మవరం చెరువును ఆధునిక హంగులతో అద్భుతమైన లేక్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. చెరువు చారిత్రక, సహజ స్వరూపాన్ని కాపాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో స్మూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) విజయవాడ బృందంతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. చెరువు అభివృద్ధికి సుమారు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని, డీపీఆర్ పూర్తయిన అనంతరం తుది అంచనా ఖరారవు తుందని తెలిపారు.

చారిత్రక వారసత్వానికి ప్రాధాన్యం : ధర్మవరం చెరువు నిర్మాణంలో ఒడియార్ కీలక పాత్ర పోషించిన చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. లేక్‌ఫ్రంట్‌లో చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రత్యేక స్థానం కల్పిస్తామని తెలిపారు. ధర్మవరం చరిత్రకు సంబంధించిన ప్రముఖులు, సాహితీవేత్తలు, క్రీడాకారులు, చేనేత రంగానికి సేవలందించిన వారి వివరాలను ప్రజలకు పరిచయం చేసేలా ప్రత్యేక థీమ్ ప్రాంతాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు.

ఆక్రమణలు, మురుగునీటికి చెక్ : దశాబ్దాలుగా మురుగునీటితో కలుషితమవుతూ, ఆక్రమణలు, నిర్లక్ష్యం కారణంగా చెరువు సహజ స్వరూపాన్ని కోల్పోతున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆక్రమణలను తొలగించడం, మురుగు నీరు చెరువులోకి చేరకుండా అడ్డుకోవడం, నీటిని శుద్ధి చేసి పరిశుభ్రమైన సరస్సుగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

16 కిలోమీటర్ల వాక్‌వే : చెరువు చుట్టూ మొత్తం 16 కిలోమీటర్ల మేర వాక్‌వే అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన ఉందని మంత్రి తెలిపారు. పట్టణానికి ఆనుకుని ఉన్న సుమారు 3.5 కిలోమీటర్ల ప్రాంతాన్ని తొలిదశలో ప్రాధాన్యతగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పాదచారులు, సైక్లిస్టులకు ప్రత్యేక మార్గాలు, జాగింగ్ ట్రాక్‌లు, గ్రీన్ బఫర్, సీటింగ్, లైటింగ్, భద్రతా రైలింగ్, వ్యూయింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఏడు ప్రాంతాల్లో ప్రత్యేక థీమ్‌లు : చెరువు పరిధిలో ఏడు ప్రాంతాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో ప్రాంతానికి ప్రత్యేక థీమ్‌తో యాంఫిథియేటర్, ఫుడ్ స్టాల్స్, పిల్లలు, యువత, కుటుంబాలు, వృద్ధులు సేదతీరే ప్రదేశాలు, బోటింగ్, ప్యాడ్లింగ్ వంటి సౌకర్యాలు కల్పించే అవకాశం ఉందన్నారు. పిల్లల పార్క్, బోటింగ్ డెక్స్, పార్కింగ్, టాయిలెట్లు తదితర సదుపాయాలు కూడా ప్రతిపాదనలో ఉన్నాయని చెప్పారు.

మహిళలు, పిల్లలు, వృద్ధులకు భద్రత : లేక్‌ఫ్రంట్‌లో ప్రజల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తెలిపారు. మహిళలు, యువత, వృద్ధులు సాయంత్రం వేళల్లోనూ స్వేచ్ఛగా వినియోగించుకునేలా లైటింగ్, సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు అనుకూలంగా ర్యాంపులు, హ్యాండ్‌రైల్స్, టాక్టైల్ పేవింగ్, వీల్‌చైర్‌కు అనుకూలమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.

చేనేత, స్థానిక కళలకు వేదిక : ధర్మవరం చేనేతకు మరింత ప్రాచుర్యం కల్పించడంతో పాటు నిమ్మలకుంట తోలుబొమ్మలు, కుమ్మరి కళలు, ఇతర స్థానిక కళలు, ఉత్పత్తులకు ప్రచారం కల్పించేలా లేక్‌ఫ్రంట్‌ను వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. స్థానిక కళాకారులు, చేతివృత్తి దారులకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

సహజ స్వరూపానికి భంగం లేకుండా అభివృద్ధి : చెరువు సహజ స్వరూపాన్ని దెబ్బతీయకుండా స్థానిక మొక్కలు, పచ్చదనం, ప్రకృతి వాతావరణాన్ని కాపాడుతూ అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. బ్లూ-గ్రీన్ ల్యాండ్‌స్కేప్ ద్వారా నీడ, పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు.

'అర్బన్ ఛాలెంజ్' ద్వారా కేంద్ర నిధులకు ప్రయత్నం : ఎన్‌పీఏ విజయవాడ బృందం ఇప్పటికే రెండుసార్లు ధర్మవరం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. చెరువు అంచులు, నీటి పరిస్థితి, ప్రజల వినియోగం, ప్రకృతి స్వరూపం తదితర అంశాలను అధ్యయనం చేసినట్లు చెప్పారు. డీపీఆర్ పూర్తయిన అనంతరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అర్బన్ ఛాలెంజ్' విధానంలో నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో 'వికసిత్ ధర్మవరం' : 'వికసిత్ ధర్మవరం'లో భాగంగా పట్టణ అభివృద్ధిని కోరుకునే ప్రముఖులు, మేధావులు, నిపుణులు, స్థానిక కళాకారులు, వివిధ రంగాల ప్రతినిధులను భాగస్వాములను చేసి వారి సలహాలు, సూచనలు తీసుకుంటామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ధర్మవరం చెరువు కేవలం నీటి వనరు కాదని, పట్టణ చరిత్ర, ప్రకృతి, చేనేత, స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే వారసత్వ సంపద అని పేర్కొన్నారు. చెరువును కాపాడుకుంటూనే భావితరాలకు అందించేలా, ప్రస్తుత తరాలకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేలా లేక్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. సమీక్ష సమావేశంలో ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, ఎన్‌పీఏ సిబ్బంది, ఈఈ సాయి కృష్ణ, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు సచివాలయ ఉద్యోగులకు అనుమతి లేదు

- ఆదేశాలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన.. చట్టపరమైన చర్యలు
- జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్





పుట్టపర్తి, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

అకాల వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఈనెల 27న విజయవాడలో నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు వెళ్లేందుకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ స్పష్టం చేశారు. సంబంధిత ఉద్యోగులకు ఇప్పటికే ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు విధులకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘించి అనుమతి లేని కార్యక్రమానికి హాజరయ్యే ఉద్యోగులపై నిబంధనల మేరకు శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, అనుమతి లేని కార్యక్రమానికి వెళ్లకుండా విధుల్లో కొనసాగాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు.

నేడు మడకశిరలో కాంగ్రెస్ నిరసన

- హాజరు కానున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి : మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్



మడకశిర, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

నేడు ఆదివారం మడకశిర పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలోని మహాత్మా గాంధీ విగ్రహంవద్ద కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు మడకశిర స్థానిక మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిబంధనలకు వ్యతిరేఖ నిర్ణయాలను నిరసిస్తూ నేడు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి హాజరవుతారన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎవరణంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఉదయం 11గంటలకు తలపెట్టిన నిరసన కార్యక్రమానికి నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, పార్లమెంట్, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ కోరారు.

బాలాజీ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం



అనంతపురం, సెప్టెంబర్ 26, అక్షర టైమ్స్ :

శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నేడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఫార్మసీ రంగ నిపుణులు ఉత్సాహంగా పాల్గొని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఫార్మసిస్టుల పాత్ర, బాధ్యతలు, ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఔషధాలను వైద్యులు, అర్హత కలిగిన ఆరోగ్య నిపుణుల సూచనల మేరకే వినియోగించాలని, స్వీయ వైద్యం వల్ల కలిగే అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు ప్రజలకు వివరించారు. మందుల సరైన మోతాదు, సమయపాలన, నిల్వ విధానం, గడువు తేదీల పరిశీలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఔషధాల పంపిణీకే పరిమితం కాకుండా రోగులకు సరైన మార్గదర్శకత్వం అందించడం, మందుల సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావడం వంటి కీలక బాధ్యతలను ఫార్మసిస్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. ఆధునిక వైద్య వ్యవస్థలో ఫార్మసిస్టుల సేవలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. వైద్యులు, రోగుల మధ్య ఔషధ సంబంధిత సమాచారాన్ని సమర్థంగా అందించే ఆరోగ్య నిపుణులుగా ఫార్మసిస్టులు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని తెలిపారు. ఫార్మసీ విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ఔషధ పరిశోధన, క్లినికల్ ఫార్మసీ, ఫార్మాకోవిజిలెన్స్, నాణ్యత నియంత్రణ, ఔషధ తయారీ వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకొని సమాజానికి ఉపయోగపడే నిపుణులుగా ఎదగాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అధ్యాపకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి డా. శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. రాజవర్ధన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' ప్రారంభం

- మదనపల్లిలో కేంద్ర ఆర్థిక మంత్రి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' గురించి జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యాన రైతులకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- ఈనెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 05 వరకు అవగాహన కార్యక్రమాలు
- జిల్లా నుంచి సుమారుగా రూ.2,252 కోట్లకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది
- ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' అంశంపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుపుకొని, రాయలసీమలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్' తో హార్టికల్చర్ ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడానికి ఒక ఉద్యమం ప్రారంభిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ మదనపల్లెలో దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతి జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యాన రైతులకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు, ప్రజలకు, అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారుగా 10 జిల్లాల్లో ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్ ప్రాజెక్ట్ కింద లబ్ధి పొందడానికి అవకాశాలు ఉన్నాయని, ఈ 10 జిల్లాల్లో అనంతపురం జిల్లా కూడా భాగస్వామ్యమై ఉందన్నారు. దీనిలో భాగంగా సుమారుగా రాబోయే 3 సంవత్సరాలలో సుమారుగా లక్ష కోట్ల రూపాయలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు ప్రకాశం, మార్కాపురంతో పాటు రాయలసీమ జిల్లాల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పరిధిలోకి తీసుకొచ్చారని, ఈ జిల్లాల్లో హార్టికల్చర్ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారన్నారు. దీనిలో గవర్నమెంట్ కి సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు కూడా ఉన్నాయన్నారు. ఉద్యానవన శాఖ, జల వనరుల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. మొత్తం ఒక లక్ష కోట్ల పెట్టబడిలో ప్రభుత్వ పెట్టుబడి 40వేల కోట్ల రూపాయలు కాగా, అందులో ఉద్యానవన రంగం కింద హార్టికల్చర్ కి సంబంధించిన పనులు చేయించుకోవడానికి 14,906 కోట్లు, నీటిపారుదల మౌలిక సదుపాయాల కోసం (హెచ్ఎన్ఎస్ఎస్ కావచ్చు, కెనాల్ నెట్వర్క్, మోడర్నైజేషన్స్, డ్రిప్ ఇరిగేషన్) ఇరిగేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి 20,844 కోట్లు, గ్రామీణ స్థాయి నుండి రోడ్లని బాగు చేయాలనే ఉద్దేశంతో రూరల్ రోడ్ డెవలప్మెంట్ వర్క్స్ కూడా సుమారుగా 4,562 కోట్ల రూపాయలు కేటాయించడం జరుగుతుందని, అన్నీ కలుపుకుంటే 40 వేల కోట్లు ప్రభుత్వ తరపు నుంచి (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) గౌరవ సీఎం గారి ఆదేశాల మేరకు ఈ యొక్క 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' అని ఒక ప్రాజెక్ట్ ప్రిపేర్ చేయడం జరిగిందని, దాన్ని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తరపు నుంచి 40 వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ చేసినప్పుడు, దానితో కలుపుకొని ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు, పారిశ్రామికవేత్తలు అందరి దగ్గర నుంచి కూడా సుమారుగా 60వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ వస్తుందని గవర్నమెంట్ దృష్టిలో ఉందన్నారు. ఇవి రెండూ కలుపుకున్నట్లయితే సుమారుగా లక్ష కోట్ల రూపాయల దాకా మొత్తం ఈ 10 జిల్లాల్లో అమలు చేయబోతున్నామన్నారు. అనంతపురం జిల్లాలో కూడా దీనికి సంబంధించి సుమారుగా 41 క్లస్టర్లలో, 32 మండలాల్లో ఎలిజిబుల్ క్లస్టర్లను ఎంపిక చేయడం జరిగిందని, ఇవి 338 ఆర్ఎస్కే (ఆర్ఎస్కే) పరిధిలో- మేజర్‌గా హార్టికల్చర్ ఇంపార్టెంట్‌గా ఉన్న ఆర్ఎస్కేలను ఎంపిక చేసి, దాని నుంచి 41 క్లస్టర్లు చేయడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో ఎలినినో లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు, క్లైమేట్ కి ఇబ్బంది లేకుండా పంటలు పండించే విధానం మీద దృష్టి పెడతామని, వాతావరణ మార్పులను తట్టుకునే నూతన ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణ కోసం 896 హెక్టార్లలో 369 కోట్ల రూపాయలు కేటాయించారని, ఇంకొక లక్ష హెక్టార్ల దాకా సుమారుగా 880 కోట్లతో సూక్ష్మ నీటిపారుదల మరియు ఫర్టిగేషన్ విస్తరణ కోసం కేటాయించారని, ఇవన్నీ కలుపుకున్నట్లయితే సుమారుగా 2,252 కోట్లకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డిపిఆర్ లన్నీ కూడా ప్రిపేర్ చేయడం జరిగిందన్నారు. ఇందులో హార్టికల్చర్, ఎపిఎంఐపి (ఏపీఎంఐపీ), ఎపిసిఎన్ఎఫ్ (ఏపీ సీఎంఎఫ్) ఈ మూడింటిని అనుసంధానం చేసుకొని, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సహకారాన్ని తీసుకొని, నీళ్లు సక్రమంగా ఇవ్వడానికి ఈ మూడు డిపార్ట్మెంట్లను కలుపుకొని ముందుకు తీసుకెళ్తామన్నారు. రాయలసీమలో పండిన పంటలని గ్లోబల్ మార్కెట్‌కి తీసుకెళ్లాలి, అక్కడ మంచి రేటు రావాలి, మంచి ఆదాయం రావాలనే ఉద్దేశంతోనే ఈ ప్రణాళిక చేశారని, కాబట్టి జిల్లాల్లో ఉన్న హార్టికల్చర్ రైతులందరికీ దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేటి నుంచి రాబోయే అక్టోబర్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారని, స్కూల్స్ ద్వారా 'నా జిల్లా - నా పంట', వ్యాసరూప పోటీలు, లోకల్ ఫ్రూట్స్ గురించి పిల్లలకు తెలియజేయడం, కాలేజీల్లో 'హార్టికల్చర్ టెక్ ఛాలెంజ్' ద్వారా బిజ్ క్రియేట్ చేయడం, సెప్టెంబర్ 29 నుండి 41 క్లస్టర్లలో రైతుల కోసం డెమోన్స్ట్రేషన్స్, ఫెర్టిగేషన్, ఫార్మ్ పాండ్స్ వంటి వాటిపై 'తోట బడి' పాఠశాలల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించడం, ఐ.అండ్.పిఆర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రచార రథం, కళాజాతాలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా 60-90 సెకన్ల వీడియోల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. రైతులు డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేసి, నాణ్యత పెంచి, గ్లోబల్ మార్కెట్‌ను అందిపుచ్చుకోవాలని, పంట దిగుబడితో పాటు నాణ్యతను పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెంపొందుతుందని, ఈ విషయాన్ని ప్రతి రైతుకూ చేరవేయాలని కోరారు. ఈ ప్రెస్ మీట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఇన్‌చార్జ్ హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

29న విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై

అవగాహన సదస్సులు

- ఢిల్లీ నుండి ఏడుగురు సభ్యులతో కూడిన జాత రాక,
- జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన



అనంతపురం, సెప్టెంబర్ 26, దరువు న్యూస్ :

విద్యార్థిని, విద్యార్థులలో నెలకొనే మానసిక సమస్యలపై అవగాహన కల్పించే విషయమై ఈనెల 29న అనంతపురం నగరంలోని కేవీఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. శనివారం సంగమేస్ నగర్ లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన వక్త సెహర్ హమీ నాయకత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం ఈ సదస్సులలో పాల్గొంటున్నట్లు